మట్టి పరీక్ష... పొలానికి రక్ష

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు, పెట్టుబడులు ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయ శాఖ

తాడేపల్లి రూరల్ : అవగాహనరాహిత్యంతో పలువురు రైతులు పంటలకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో లేవో తెలుసుకోకుండానే సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్నారు. మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా 5వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు.

మట్టి పరీక్ష తప్పనిసరి

సాగు చేసే ముందు ప్రతి రైతు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయించుకోవాలి. పంట కోత ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించాలో.. రసాయన ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. భూమికి రక్షగా ఉంటుంది. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమిసంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి సాగు చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

అవగాహనరాహిత్యంతో ఖర్చుల భారం

వాస్తవానికి 90 శాతం మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడుతున్నా ఖర్చుల భారం తప్పా పెరగడం లేదు. వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సమాయత్తమైంది. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి భూసార పరీక్షలు ఎంత అవసరమో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. విత్తనానికి ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాల్ని బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. భూసార పరీక్షల విధానంలో కూడా కొత్త పద్ధతుల్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. మారిన విధానంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.



దుగ్గిరాలలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది



వ్యవసాయ భూమిలో సేకరించిన మట్టి

రైతు భరోసా కేంద్రాల్లో పరీక్షలు

ఎరువుల వినియోగంలో అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లోనే భూసార పరీక్షలు చేయించుకునే ఏర్పాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా ఈ పరీక్షలు ఉపయోగపడనున్నాయి.

సూక్ష్మ పోషకాలే కీలకం

పొగులో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. స్థూల, సూక్ష్మ పోషకాలతో పాటు పీహెచ్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం, సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.2 శాతం వరకు ఉన్నట్లు పరీక్షల నివేదికల ద్వారా అధికారులు గుర్తించారు. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. దీని ద్వారా భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువుల్ని వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో వైపు మట్టినమూనా సేకరించే విధానంపై వీఏఏలు, ఏవోలకు వ్యవసాయ శాఖ జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చింది. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు తెలియజేయాల్సిన వివరాలపై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు.

రైతులకు అవగాహన పెరగాలి

భూసార పరీక్షలపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టి నమూనా పరీక్ష లేకుండా సాగు చేయకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నేల ఆరోగ్యంగా ఉంటే అంతా ఉంటాం. మట్టి పరీక్షల ఆధారంగానే యాజమాన్య పద్ధతులు చేపట్టి పంట దిగుబడులు సాధించాలి. తద్వారా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. దీనిపై రైతుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. భూసార ప్రయోగ కేంద్రంలో మట్టికి సంబంధించి ఉదజని సూచిక, నేల స్వభావం, లవణ సాంద్రత, సేంద్రియ కర్బనం, లభ్య పోషకాల స్థాయిని లెక్కిస్తారు. ప్రయోగశాల నుంచి వచ్చిన ఫలితాలను బట్టి సిఫార్సులను రైతులు తప్పకుండా పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– శిరీష, మండల వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

వేసవిలో వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి

ఫిరంగిపురం: వేసవిలో వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి పి. ఎస్తేరురాణి సూచించారు. మండలంలోని వేములూరిపాడు సచివాలయం వద్ద శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల్ని నిర్వహించారు. 247మందికి షుగర్, బీపీ, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వృద్ధులకు వేసవి ఎండల తీవ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మధ్యాహ్నం ఎండలో తిరగకుండా ఉండాలని సూచించారు. వడదెబ్బ తగిలితే డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉచిత మంచినీటి కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నా మేరీ, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం అంథోనిరాణి, మేల్ హెల్త్ అసిస్టెంట్ బాబూరావు, ఆశా కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, జోజమ్మ, శాంతకుమారి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని సుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఫరీనా బేగం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రత గురించి వివరించారు. బానలు, గాబుల్లో నీరు ఎక్కువ రోజులు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మురుగు పారని ప్రదేశాల్ని ఆరోగ్యసిబ్బంది గుర్తించి వాటిని యాప్‌లో అప్‌లోడు చేస్తారని, వాటిని గుర్తించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సమస్యల్ని పరిష్కరిస్తారని తెలిపారు.

వృద్ధుడికి నిత్యావసర సరుకుల పంపిణీ



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో నివాసముంటూ అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి శుక్రవారం విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ స్వాతి గౌడ్ మాట్లాడుతూ కాలనీలో నివాసముంటున్న కొనతల రాఘవయ్య అనే వృద్ధుడు పక్షవాతంతో బాధపడుతూ జీవనోపాధి కష్టంగా ఉందని స్థానికుల ద్వారా తెలుసుకున్నామని తెలిపారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన నల్లబోతుల పుల్లయ్య, విజయలక్ష్మి దంపతుల కుమారుడు నల్లబోతుల కిరణ్ హర్ష, నందీప్‌కుమార్ స్పందించి రాఘవయ్య కుటుంబానికి నిత్యావసర సరుకులు విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్ బొడ్డేటి రమేష్, కాటూరి శ్యామ్, నూతక్కి నాగబాబు, కొండతల వెంకటేశ్వరమ్మ, పేరం నాగమణి పాల్గొన్నారు.

అప్సా కో-చైర్మన్‌గా రవీంద్రబాబు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘ (అప్సా) రాష్ట్ర కో-చైర్మన్‌గా గుంటూరు నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సెయింట్ లారెల్స్ స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు ఎన్నికయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన అప్సా రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తనను రాష్ట్ర కౌన్సిల్ కో-చైర్మన్ పదవికి ఎన్నికైనట్లు ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు నియామక పత్రం అందజేసినట్లు రవీంద్రబాబు శుక్రవారం తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రతినిధులు పి. రాము, చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు, కోమారెడ్డి కిశోర్, వి. సుందరరావు, కొమరగిరి పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు: చుండూరు మండలం యడ్లపల్లిలో కొలువైన శ్రీ రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నిత్య హోమం, బలిహరణ చక్రస్నానం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. స్వామిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. రాత్రి ధ్వజారోహణ వైభవంగా జరిగింది.

రక్షిత మంచినీటి చెరువు పరిశీలన



మేడికొండూరు: గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మండల పరిధిలోని కొర్రపాడులో రక్షిత మంచి నీటి చెరువును ఎంపీడీవో ప్రభాకరరావు, అధికారులు శుక్రవారం పరిశీలించారు. చెరువులో జమ్మును తొలగించి శుభ్రం చేయకుండా అపరిశుభ్రంగా ఉందని గ్రామ ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో ప్రభాకరరావు పరిశీలించారు. అయితే, చెరువు శుభ్రంగా ఉందని అధికారులు గుర్తించారు. తనిఖీల్లో ఈఓపీఆర్డీ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుజాత, పంచాయతీ సెక్రటరీ వంశీకృష్ణ ఉన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరం: స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆరు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు వెల్లడించారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోబోటిక్స్‌పై ఆకట్టుకున్న వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో ఆరు నుంచి టెన్త్ విద్యార్థులకు రోబోటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. టెస్లా హౌస్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ఆవిష్కరణలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రోబోటిక్స్‌పై అవగాహన వల్ల విద్యార్థులకు సైన్స్, సెన్సార్లు, మోటార్లు, ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరుగుతుందని, తద్వారా విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థుల్ని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా, సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు రెండు వారాల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

కర్రసాములో పాటిబండ్ల స్కూల్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కర్రసాము (సిలంబం) పోటీల్లో తమ పాఠశాల 7వ తరగతి విద్యార్థిని ఎం. జగ్వీ కృష్ణ కాంస్య పతకాన్ని సాధించినట్లు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ యూనియన్ సిలంబం ఫెడరేషన్ ఈనెల 17,18,19వ తేదీల్లో నూతక్కిలో నిర్వహించిన ఓపెన్ ఏషియన్ చాంపియన్‌షిప్ సిలంబం పోటీల్లో తమ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ చూపిందని పేర్కొన్నారు. యుద్ధ విద్య అయిన కర్రసాములో ప్రావీణ్యం సాధించడం గొప్ప విషయమని, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జగ్వీకృష్ణతో పాటు కోచ్‌లు బి. కిరణ్ బాబు, వి. రామకృష్ణను పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాటిబండ్ల నరేంద్రనాథ్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి అభినందించారు.



జగ్వీ కృష్ణను అభినందిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి, నరేంద్రనాథ్

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీత- ఆత్మసంయమయోగః ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 20న జరుబుల బంగారుబాబు సౌజన్యంతో ప్రారంభమవ్వగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీ సువీరానందస్వామి ప్రసంగిస్తూ యోగి శాస్త్ర జ్ఞానులు, సకామకర్మలను ఆచరించే వారి కన్న శ్రేష్టుడని అన్నారు. భక్తి విశ్వాసాలతో, ధృఢమైన అనన్య భావంతో తనయందే స్థిరబుద్ధుడై ఉండమని శ్రీకృష్ణుడు పలికారని తెలిపారు. నిరంతరం తనను భజించేవాడు పరమ శ్రేష్టుడని ఆయన బోధించాడన్నారు. అనంతరం శ్రీసువీరానందస్వామిని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సత్కరించారు.



మాట్లాడుతున్న సువీరానందస్వామి

రేపు చెన్నైలో 'ఏడో రుతువు' పుస్తకావిష్కరణ

తెనాలి: విశ్వర్షి వాసిలిగా ప్రసిద్ధికెక్కిన వాసిలి వసంతకుమార్ తాజా రచన 'ఏడో రుతువు' కవితా సంపుటి ఈనెల 26న చెన్నైలో ఆవిష్కరణ జరగనుంది. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక 'తరతరాల తెలుగు కవిత' పేరుతో నెలనెలా నిర్వహిస్తున్న ఉపన్యాస ధారావాహిక కార్యక్రమాన్ని ఆరోజు సాయంత్రం అక్కడి ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణాహాలులో ఏర్పాటు చేశారు. ఇందులో తొలి తెలుగు యౌగిక కావ్యం నేనుః వైవిధ్యత, వినూత్నత అంశంపై విశ్వర్షి వాసిలి ప్రసంగిస్తారు. ఆయన రాసిన కవితల సంపుటి 'ఏడో రుతువు' పుస్తకాన్ని ఇదే వేదికపై ఆవిష్కరిస్తారు. వేద విజ్ఞానవేదిక అధ్యక్ష, కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు పర్యవేక్షిస్తారు. సనాతన ధర్మ మూలాలకు సామాజిక స్పృహను జోడించి వ్యక్తిత్వ వికాస విజ్ఞానాన్ని సరళంగా అందిస్తున్న విశ్వర్షి వాసిలి నిజానికి మాస్టర్ యోగ గురువు. సొంతూరు తెనాలి సమీపంలోని కోపల్లె. ఆంగ్లోపన్యాసకుడిగా, మాస్టర్ యోగ గురువుగా, బహు గ్రంథకర్తగా తెలుగువారికి సుపరిచితులైన శతాధిక గ్రంథకర్త 'మాస్టర్' శార్వరి కుమారుడు. సికింద్రాబాద్‌లో తండ్రి స్థాపించిన 'యోగాలయ' రీసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆర్కివ్స్ సెంటర్, మీడియా వెల్ఫేర్ సెంటర్, కౌన్సెలింగ్ సెంటర్‌నూ నడుపుతున్నారు. వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక మనో విశ్లేషణలకు పుస్తక రచనల వాకిళ్లను తెరిచి, తన అసంఖ్యాక రచనలతో తెలుగులో ప్రత్యేకస్థానం దక్కించుకున్నారు. గీత నుంచి మొదలుపెట్టి, అనేక ప్రాక్పశ్చిమ తాత్విక అంశాలపై ఆయన రాసిన పుస్తకాలు ప్రజాదరణను పొందాయి. 'వాసిలి వాకిలి' కాలమ్ పాఠకుల విశేష అభిమానాన్ని అందుకుంది. ఆ కలం నుంచి వెలువడిన 'నేను', తెలుగులో తొలి యౌగిక కావ్యం. ఆధ్యాత్మిక దృష్టి కోణానికి ఆధునికతను మేళవించిన 'నేను' విశ్వావలోకనం తెలుగు సాహిత్య చరిత్రలో నవీన ప్రయోగంగా మేధావుల ప్రశంసలందుకుంది.



ఏడో రుతువు కవితా సంపుటి

బ్యాగులో బంగారు గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: బ్యాగులో బంగారు గొలుసు చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రవీంద్రనగర్‌కు చెందిన శ్రీనివాస్ భార్యతో కలిసి శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆటోలో ప్రయాణించి ఇంటికి చేరారు. లోపలకు వెళ్లి చూడగా బ్యాగు కత్తిరించి ఉంది. అందులోని వంద గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

యువతి వెంటబడి వేధిస్తున్న యువకుడిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందరావుపేటకు చెందిన ఫైజల్ ఈనెల 19న ఓ యువతిని జాలయ్య కాలేజీ వద్ద వెంటపడి వేధించాడు. బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేట జీరోలైనులో నివసించే చినజాన్ (53) కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈనెల 18న పోలీసు పెరేడ్ గ్రౌండ్ వద్ద పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



పట్నంబజారు: మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారానికి చెందిన కొనగళ్ల మురళీకృష్ణ (54) అదే ప్రాంతంలో కాళీయమర్దన దేవాలయాన్ని 2011లో నిర్మించారు. అప్పటి నుంచి ఆలయ బాధ్యతలు ఆయనే చూసుకుంటుండేవారు. ఆలయానికి సంబంధించిన రశీదు పుస్తకాలు కనపడక పోవడంతో మనస్తాపానికి గురైన గురువారం రాత్రి కోనేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం మృతదేహం పైకి తేలడంతో గుర్తించిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

స్కిజోఫ్రీనియాపై అశ్రద్ధ వద్దు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ వెంకట కిరణ్

గుంటూరు మెడికల్: ప్రపంచ స్కిజోఫ్రీనియా అవగాహనా దినోత్సవం సందర్భంగా గుంటూరు జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగంలో శుక్రవారం ఇంటర్నల్, పీజీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రం నిర్వహించారు. పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఒత్తిడి వల్ల పలువురు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డాక్టర్ దయానిధి మాట్లాడుతూ మానసిక సమస్యల్ని వెంటనే గుర్తించి చికిత్స అందిస్తే రోగి త్వరగా కోలుకుంటారని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమా జ్యోతి, సహ ఆచార్యులు డాక్టర్ వెంకట కిరణ్, డాక్టర్ సాయి కిరణ్, నిమీష, సాయికృష్ణ, రత్న కిషి, ప్రసాద్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

సీఐ వీరేంద్రబాబు

ఫిరంగిపురం: మండలంలోని గ్రామాల్లో ఓట్ల లెక్కింపు రోజున ఎన్నికల నిబంధనల ప్రకారం శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ వీరేంద్రబాబు హెచ్చరించారు. స్థానిక స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ముందు గానీ, తర్వాత గానీ సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు అంతకంటే ఎక్కువ మంది ఒకేచోట గుమికూడి ఉండకూడదని సూచించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులపై నిఘా ఉందని తెలిపారు. సంఘ విద్రోహ శక్తులను గుర్తించి వారిపై ప్రత్యేక సిబ్బంది ద్వారా ప్రతి కదలికల్ని గమనిస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరనారాయణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, మోహన్‌రావు, రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నవులూరు గ్రామంలోని మక్కేవారిపేట, గోలివారిపేట, బాపనయ్యనగర్, ఈయస్ఆర్ గార్డెన్స్, పుట్ట రోడ్డు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్, టిడ్కో గృహ సముదాయాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

- మంగళగిరి పట్టణ ప్రాంత పరిధిలోని సీతారామ కోవెల, గౌతమ్ బుద్ధ రోడ్డు, అన్నపూర్ణ థియేటర్, ఎన్ఆర్ఐ ఎదురు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఉదయం 7 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.
- తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్, కొత్తకాలువ నుంచి ఉండవల్లి ఇళ్ల వరకు, దళితవాడ, కుమ్మరికుంట, కోస్టల్ బ్యాంక్ ఏరియా, అమరారెడ్డి నగర్, కోలా సుబ్బారావు వీధి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు..

తుళ్లూరు మండలంలో...

తాడికొండ: నూతన విద్యుత్ లైన్ల నిర్మాణంలో భాగంగా తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెం, మల్కాపురం, వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, ఏపీ టిడ్కో గృహాలు, ఐనవోలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ వి. ఉమా మహేశ్వరరావు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు

రేపల్లె మండలం
కామరాజుగడ్డ వద్ద ఘటన

రేపల్లె రూరల్: ట్రాక్టర్ బోల్తాపడి 20 మందికి పైగా గాయాలైన సంఘటన మండలంలోని కామరాజుగడ్డ గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలం దూళిపూడి పంచాయతీ పరిధిలోని ఉయ్యూరు వారిపాలెం గ్రామస్తులు గ్రామ దేవత గుడారంకమ్మ అమ్మవారి కొలుపులలో భాగంగా రెండు ట్రాక్టర్‌లలో రేపల్లె మండలం మోర్తోట కృష్ణానదికి వచ్చారు. ఇదే ఉత్సవాలలో పాల్గొనేందుకు కొల్లిపర్ర మండలం దావులూరువారి పాలేనికి చెందిన 30 మంది మరో ట్రాక్టర్‌లో వచ్చారు. వీరంతా కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించి కొలుపులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఉయ్యూరువారిపాలేనికి చెందిన రెండు ట్రాక్టర్లు వెళ్లిపోయాయి. దావులూరివారిపాలేనికి చెందిన వారు గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా కామజుగడ్డ వద్ద మలుపు తిరిగే సమయంలో ఒక్కసారిగా రహదారిపై బోల్తా పడింది. అందులో ఉన్న 30 మందిలో 20 మంది వరకు గాయాలపాలయ్యారు. దీంతో స్థానికులు 108కి సమాచారం అందించగా వాహనంలో కొంత మందిని, ప్రైవేటు వాహనాలలో మరికొంత మందిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో తీవ్రంగా గాయాలపాలైన ఉయ్యూరు వెంకటేశ్వరమ్మ, ఉయ్యూరు వీరవెంకటరత్నం, గోపీకృష్ణ, శ్రీహరి, సావిత్రి, వెంకటేశ్వరరావు, భవానీ, సాంబశివరావు, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, వెంకటేశ్వరమ్మలను ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్సకు తెనాలి వైద్యశాలకు తరలించారు. స్వల్ప గాయాలైన మిగిలిన వారికి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ప్రమాదంలో క్షతగాత్రులు